నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–2, పీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పృథ్వీరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాసవి శివనగర్ ఫీడర్ పరిధిలోని వాసవి శివనగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, మారుతీ ఎన్‌క్లేవ్, లక్ష్మీనర్సింహ్మకాలనీ, మీనాక్షినగర్, శివసాయినగర్ కాలనీల్లో ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు, సాయినగర్ 11 కేవీ పీడర్ల పరిధిలో 12 గంటల నుంచి 12:30 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీహెచ్ అర్చన తెలిపారు. గోకుల్‌నగర్ ఫీడర్ పరిధిలోని హెచ్‌బీజీ, ఆఫీసర్స్‌కాలనీ, జీ బ్లాక్, అంకుర ఆసుపత్రి, గోకుల్‌నగర్, పార్వతీనగర్ కాలనీల్లో ఉదయం 10:30 గంటల నుంచి 11 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలో..

మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ రాధా సత్సంగ్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు రుక్మిణి ఎన్‌క్లేవ్, పెద్ది పర్మారెడ్డి కాలనీ, సంజీవ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్, గణేష్ ఎన్‌క్లేవ్, రాయల్ ఎన్‌క్లేవ్, రామ్‌దేవ్ బాబా టెంపుల్, లక్ష్మీనగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, అదేవిధంగా ఫాదర్ బాలయ్యనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు ఫాదర్ బాలయ్యనగర్, భవానీనగర్, సిటిజెన్ కాలనీ, అయ్యప్పనగర్, అంబేద్కర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, అదేవిధంగా భూదేవినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుండి 4:30 వరకు సుభాష్‌నగర్, ప్రభుత్వ పాఠశాల, ఆర్టీసీ కాలనీ, టీచర్స్ కాలనీ, గన్‌రాక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

దేవేందర్‌నగర్ ఫీడర్ పరిధిలో..

దేవేందర్‌నగర్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు అంబేద్కర్‌నగర్, దేవేందర్‌నగర్, గౌతమినగర్, ఇందిరానగర్, జ్యోతి నగర్, గణేష్‌నగర్, వీరారెడ్డినగర్, సిసిఎంబి కాలనీ, అన్నపూర్ణ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ శ్రీ సంతోషిమాత, శ్రీ సాయిబాబా మందిరంలో ఈ నెల 17,18,19 తేదీల్లో ఊయలలో పడుకున్న సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎంఎల్.కాంతారెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు వేద పండితులచే పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

బంగారు చీరె అలంకారంలో అమ్మవారు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవీ అమ్మవారు వరలక్ష్మి శుక్రవారాన్ని పురస్కరించుకుని బంగారు చీరె అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

మల్లాపూర్: వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం అంగరవైభవంగా నిర్వహించారు.. నాచారంలో పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. నాచారం మహంకాళి ఆలయ పాలకమండలి సభ్యులు ప్రేమ్‌కుమార్ నివాసంలో నిర్వహించిన వరలక్ష్మీ వత్రం పూజకు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ హాజరయ్యారు. కార్యక్రమంలో అరవింద్, శిల్ప,రాజ్‌కుమార్, రమ్యశ్రీ, ప్రవీణ్ వీణా, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ కోదండరాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీజేఎస్ నేతలు

అల్వాల్: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం శుక్రవారం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీజేఎస్ నాయకులు శాసనమండలిలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీజేఎస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఏర్పుల దయాకర్, నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాస్, ఆశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అటల్ బిహారీ వాజ్‌పేయ్‌కి నివాళి

గౌతంనగర్: భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం గౌతంనగర్‌లో బీజేపీ నాయకులు వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా బండారి రవి, వెంకట కిషోర్, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మణ్‌రావు, సాయిబాబా, బలరామ్, రాజశేఖర్, గౌతమ్, నరేష్, సాయి, అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మంత్రి పొంగులేటికి పరమేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు



రామంతాపూర్ : ఉప్పల్‌లోని కల్యాణిపురి హైకోర్టు కాలనీ వాటర్ ట్యాంకుల సమీపంలోని 1050 గజాల ప్రభుత్వ భూమిని జీవో నెంబర్ 59 ముసుగులో కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కలిసి ఫిర్యాదు చేశారు. రూ.8కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతో క్రమబద్ధీకరించుకున్నారని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అక్రమ క్రమబద్ధీకరణపై జిల్లా కలెక్టర్‌తో చర్చించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తీరనున్న ఓల్డ్ రామంతాపూర్ సీవరేజీ కష్టాలు

● జలమండలి ఎండీ ప్రత్యేక దృష్టితో సీవర్ మెయిన్ పునరుద్ధరణ పనులు



ఉప్పల్ సర్కిల్‌లో పర్యటిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఓల్డ్ రామాంతాపూర్‌లోని సివర్ మెయిన్ పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు వెంటనే ప్రారంభించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి సివర్ మెయిన్ పైపులైన్‌ను పరిశీలించారు. ఓల్డ్ రామంతాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉత్పన్నమయ్యే మురుగు నీటిని నల్లచెరువు ఎస్టీపీలోకి మళ్లించి శుద్ధి చేయడానికి నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టరేట్ నిధులతో గతంలో 6720 మీటర్ల పొడవుతో 1000 ఎంఎం డయా పైపు లైన్ నిర్మించారు. తర్వాతి కాలంలో ఉప్పల్ మున్సిపాలిటి పరిధిలోని రామంతాపూర్, శ్రీనివాస నగర్, రామంతాపూర్ చెరువు ప్రాంతాలు కవరయ్యేలా 600 ఎంఎం డయా, 450 ఎంఎం డయా పైపు లైన్ల నిర్మాణం చేపట్టారు. దీంతో మెయిన్ పైప్ లైన్ పొడవు 7940 మీటర్లకు చేరింది. ఈ పైప్ లైన్ నిర్వహణ ఉప్పల్ మున్సిపల్ అధికారులు చేపట్టే వారు. తర్వాతి కాలంలో అది జీహెచ్ఎంసీ పరిధిలోకి వెళ్లింది. నగర శివారు సీవరేజీ బాధ్యతల్ని జలమండలికి అప్పగించడంతో సీవర్ మెయిన్ నిర్వహణ బాధ్యతను బోర్డు చేపట్టింది. అయితే.. నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అంబర్ పేట్ వరకు కొత్త రోడ్డు వేసే క్రమంలో.. పైపు లైన్‌తో పాటు కొన్ని మ్యాన్ హోల్స్ మరమ్మతులకు గురయ్యాయి. ముఖ్యంగా సాయిబాబా నగర్ కాలనీ, దేవేందర్ నగర్ కాలనీ, లక్ష్మి నగర్ కాలనీ ప్రాంతాల్లో అధిక శాతం ధ్వంసం కావడంతో అక్కడ చోకేజీ ఏర్పడింది. దీంతో పైన పేర్కొన్న ప్రాంతాల ప్రజలకు సీవరేజీ కష్టాలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఈ విషయం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి దృష్టికి రావడంతో.. ఆయన శుక్రవారం పైప్ లైన్ ను సందర్శించి పునరుద్ధరణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ ఆ చోకేజీని క్లియర్ చేసేందుకు చాలా ప్రయత్నాలు చేసినా.. ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా.. అక్కడి నివాసితులకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభించలేదు. జలమండలి చేపట్టే పునరుద్ధరణ పనులు తక్షణమే ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎండీ అధికారులను ఆదేశించారు. దీని కోసం బకెట్ క్లీనింగ్ పద్ధతి ద్వారా పూడిక తీత పనులు చేపడితే ఎక్కువ సమయం పట్టే అవకాశముంది. అందుకే సూపర్ సక్కర్, పెద్ద ఎయిర్ టెక్ మిషన్ల ద్వారా పనులు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ –2 స్వామి, సీజీఎం సుజాత, జీఎం సంతోష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



నీటి గుంటను పరిశీలిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: అశోక్‌నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బోడుప్పల్‌లో నిర్వహించిన డ్రై డే– ఫ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిఈ చిరంజీవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



ఇన్వెస్టీచర్ సెర్మనీలో పాల్గొన్న విద్యార్థులు

అల్వాల్: విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని లిటిల్ ఫ్లవర్ స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.సదానంద్ అన్నారు. శుక్రవారం ఓల్డ్ అల్వాల్‌లోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో ఇన్వెస్టీచర్ సెర్మనీ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంస్థ చైర్మన్ డాక్టర్ కె.సదానంద్, ప్రిన్సిపాల్ జ్యోతిసదానంద్, డైరెక్టర్ శరత్‌చంద్ర బార్గవ్, వైస్ ప్రిన్సిపాల్ శివలీరాయ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సదానంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఉత్తమ నాయకత్వ లక్షణాలు కలిగిన నాయకులు ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తూ దేశానికి ఎనలేని సేవ చేస్తారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లోని అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్, శేఖర్, నరేష్, వెంకటరావు, దశరథ్ యాదవ్, పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నిమ్మ అశోక్‌రెడ్డి

చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

బోడుప్పల్: చెంగిచర్లలోని చింతల చెరువుకు హద్దులను ఏర్పాటు చేసి కబ్జా బారి నుంచి కాపాడాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు శుక్రవారం హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్ మాట్లాడుతూ చెంగిచర్లలోని సర్వేనంబర్ 59లో ఓ మాజీ ఎమ్మెల్యే 4.12 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ చేసి కాలనీని ఏర్పాటు చేశారన్నారు. సదరు సర్వే నంబర్‌ను ఆనుకుని ఉన్న చింతల చెరువు స్థలాన్ని 59 సర్వే నెంబర్‌లో చూపించి హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకుని బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారన్నారు. హైడ్రా కమిషనర్ చింతల చెరువును సందర్శించి, చెరువుకు హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు.

పాత్రికేయుడికి చేయూత

మల్కాజిగిరి: కాలికి గాయమై అరుంధతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ పాత్రికేయుడు మండే సురేష్‌కు మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ చేయూత నందించింది. శుక్రవారం ఆస్పత్రిలో ఆయనను పరామర్శించి క్లబ్ సభ్యులు ప్రెస్ క్లబ్ తరపున రూ. 21,500 ఆర్థిక సహాయాన్ని చెక్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజు, విశాల్‌యాదవ్, పాత్రికేయులు రవియాదవ్, సునీల్‌రెడ్డి, పవన్, రాజేందర్, మనోహర్, కుమ్మరిరాజు, ప్రభాకర్, వెంకటరమణ పాల్గొన్నారు. అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని చికిత్స అందజేసిన అరుంధతి ఆస్పత్రి ఫౌండర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

వ్యక్తి అదృశ్యం



మల్యాల కోటేష్ (ఫైల్)

మల్లాపూర్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ పద్మావతి కాలనీకి చెందిన మల్యాల కోటేష్ (43) లైట్స్, సౌండ్స్ బిజినెస్ చేసేవాడు. గురువరం తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలేసి నాచారం బాబానగర్‌లో అద్దెకు ఇచ్చిన ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి బయటికి వెళ్లిన అతను ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. అతడి భార్య మల్యాల కళ్యాణి ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ధ్వజారోహణం



మల్కాజిగిరి: లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గరుడహోమం, ధ్వజారోహణము, సాయంత్రం శేషవాహనసేవ తదితర పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు, అర్చకులు వేణుగోపాలచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ రవీందర్‌రెడ్డి , క్లర్క్ సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం స్వామి వారి కల్యాణోత్సవము, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

కేటీఆర్ వ్యాఖ్యలు అనైతికం

మల్కాజిగిరి: మహిళలపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మల్కాజిగిరి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటేష్‌యాదవ్, సతీష్‌కుమార్, గుండా నిరంజన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మహిళలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులకు గౌరవం లేదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

సత్కారం



రామంతాపూర్: రాష్ట్ర సీఐడీ విభాగంలో డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామంతాపూర్ శారదానగర్‌కు చెందిన సైని శ్రీనివాస్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శారదానగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమన్న వెంకటరెడ్డి, బాలరాజు యాదవ్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన కొలను పరిశీలన



ఉప్పల్: ఉప్పల్ నల్లచెరువులో గణేష్ నిమజ్జన కొలనును శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి పరిశీలించారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏసీపీ వివరించారు. కార్య క్రమంలో ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ఉప్పల్ డీసీ అంజానేయులు,ఈఈ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్‌పురిలో కే క్యూ సెలూన్ ప్రారంభం



కే క్యూ సెలూన్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరో సుధీర్‌బాబు

కుషాయిగూడ: కాప్రా సైనిక్‌పురిలో సినీ హీరో సుధీర్‌బాబు సందడి చేశారు. ఆధునాతన హంగులతో సైనిక్‌పురిలో ఏర్పాటు చేసిన కే క్యూ సెలూన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే నెంబర్ వన్ సెలూన్‌గా పేరుగాంచిన కె క్యూ సెలూన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాకులు మునీర్ ఎస్.కె, ప్రియా ఎస్.కె లను అభినందిస్తూ వారు భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం అందానికి చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారని. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునాతన పరిజ్ఞానంతో స్కిన్, హెయిర్, మేకప్, నెయిల్స్ అలంకరించి అందంగా తీర్చిదిద్దడంలో కే క్యూ సెలూన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సెలూన్ తో పాటు బ్రైడల్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మునీర్ ఎస్.కె, ప్రియా ఎస్.కె మాట్లాడుతూ స్కిన్, హెయిర్, మేకప్, గోర్ల అలంకరణతో పాటు నగరంలో ఎక్కడ అందుబాటులో లేని కొరియన్ ట్రీట్‌మెంట్, హైడ్రాఫెసియల్స్ తమ ప్రత్యేకత అన్నారు.



నిర్వాహకులు, సిబ్బందితో సుధీర్‌బాబు

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మీడియా అధికార ప్రతినిధిగా గగన్ కుమార్



నియామక పత్రం అందుకుంటున్న గగన్ కుమార్

కాప్రా: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధిగా ఏఎస్‌రావు నగర్ డివిజన్‌కు చెందిన తాడూరి గగన్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి ప్రతిపాదన మేరకు రాష్ట్ర కమిటీ ఆదేశంతో మీడియా అధికార ప్రతినిధిగా తనను నియమించినట్లు గగన్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు గత ఆరేళ్లుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోరాడుతుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడిగా 2018లో బాధ్యతలు చేపట్టానని..నాటి నుంచి నేటి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యమకారుల గళం వినిపిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



పోచమ్మకు చెక్కు అందజేస్తున్న కాలనీ వాసులు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేఎల్ రెడ్డి నగర్, హెచ్‌సీఎల్ కాలనీలో వాటర్ లైన్‌మెన్‌గా పని చేసిన నాగారం స్వామి ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. శుక్రవారం మృతుడు స్వామి భార్య పోచమ్మకు రూ.50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాలనీ ఆసోసియేషన్ అధ్యక్షులు పల్లా మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకుబ్ రెడ్డి, కోశాధికారి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు వినోద్, కాలనీవాసులు.ఆసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు

రామంతాపూర్: అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పద్మావతి కాలనీలోని పోచమ్మ ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుష్ట శక్తులు దూరం చేసే అమ్మవార్లను ఆరాధిస్తే అనేక శుభాలు జరుగుతాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని అమ్మవారి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యకరమంలో పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నవీన్, మోహన్‌రెడ్డి, నర్సయ్య, సల్ల ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుభారెడ్డి, మధు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న పరమేశ్వర్‌రెడ్డి

త్రివర్ణ పతాకానికి భంగం కలగనివ్వొద్దు

కుషాయిగూడ: త్రివర్ణ పతాకానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ అన్నారు. స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంట జాతీయ జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చిందన్నారు. అయితే జాతీయ జెండాలను భద్రపరిచి గౌరవించడంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమైందన్నారు. జాతీయ పండుగలు ముగిసిన వెంటనే వెన్నెల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరిగిన, రోడ్లు, చెత్తకుప్పల్లో పడిపోయిన జాతీయ జెండాలను సేకరించి ఫ్లాగ్ కోడ్ 2022 నిబంధనల ప్రకారం ఖననం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను గత కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నామన్నారు. జాతీయ జెండాలను భద్రపరచడంలో ప్రజలకు అవగాహన కల్పించి, దేశభక్తిని పెంపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.



జాతీయ జెండాలను సేకరిస్తున్న సుంకర నరేష్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657